సాక్షి
వికారాబాద్
బుధవారం। 13। నవంబర్। 2024



కొనుగోలులో జాప్యం!

ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకునేందుకు అన్నదాతలు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

8లో▸



కోతల జోరు..

జిల్లాలో వరి కోతలు, నూర్పిడిలు ప్రారంభమయ్యాయి. రైతులు, కూలీలు పొలాల్లో బిజీగా ఉంటున్నారు.

8లో▸



ఆలు సాగుకు అదునిదే..

అతి తక్కువ కాల పరిమితిలో కోతకు వచ్చేది ఆలు పంట మాత్రమే. విత్తిన 110రోజులలో పంట చేతికి వస్తుంది.

9లో▸

న్యూస్‌రీల్

లగచర్ల ఘటన దురదృష్టకరం

ఎంపీలు డీకే అరుణ, కొండా



అనంతగిరి: లగచర్ల ఘటన దురదృష్టకరమని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో కలిసి మంగళవారం ఆమె వికారాబాద్ వచ్చారు. ఈ సందర్భంగా ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడారు. అధికారులపై దాడిని ఎంతమాత్రం సమర్థించేది లేదన్నారు. ఫార్మాసిటీ భూ సేకరణ విషయంలో పంతానికి పోవద్దని, ప్రజాభిప్రాయాన్ని గౌరవించాలని సీఎం రేవంత్‌రెడ్డికి సూచించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకునేందుకు తాము బుధవారం లగచర్లకు వెళ్తామని తెలిపారు. ఎంపీ కొండా మాట్లాడుతూ.. అధికారులపై దాడిని తప్పుబట్టారు. తప్పు చేసిన వారిని శిక్షించాలని, సామాన్యుల జోలికి వెళ్లొద్దని సూచించారు. ఘటనలో రాజకీయ కుట్ర ఉందని అనుమానం వ్యక్తంచేశారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు వడ్ల నందు, శ్రీధర్‌రెడ్డి, నరోత్తంరెడ్డి, సుచరితారెడ్డి పాల్గొన్నారు.

అనంతుడి సేవలో ఎంపీ డీకే అరుణ



అనంతగిరి: వికారాబాద్ సమీపంలో వెలసిన అనంతపద్మనాభ స్వామి ఆలయాన్ని మంగళవారం మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ దర్శించుకున్నారు. ఆలయం ముందు ఉన్న ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకులు తీర్థ ప్రసాదాలు అందించి జ్ఞాపికను అందజేసి ఆశీర్వచనాలు అందజేశారు. ఆమె వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి పలువురు నాయకులు ఉన్నారు.

అడవిలోకి వెళ్లొద్దు

ధారూరు: మెథడిస్టు క్రిస్టియన్ జాతరకు వచ్చే భక్తులు సమీప అడవిలోకి వెళ్లరాదని ధారూరు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రాజేందర్ మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. జాతరకు వచ్చే భక్తులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు. అడవిలో ప్లాస్టిక్ కవర్లు వేయరాదని, వాటిని వన్యప్రాణులు తింటే ప్రాణాలకు ప్రమాదమన్నారు. అడవిలో మద్యం తాగితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రిజర్వేషన్లపై ప్రజాభిప్రాయ సేకరణ నేడు

అనంతగిరి: స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్ల దామాషాపై బుధవారం ఉదయం 10.30 గంటలకు రంగారెడ్డి కలెక్టరేట్‌లో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నట్లు కలెక్టర్ ప్రతీక్ జైన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని బీసీ కుల సంఘాలు, ప్రజా ప్రతినిధులు, పార్టీలు, ప్రజల నుంచి అభ్యర్థనలు, సలహాలు, ఆక్షేపనులను తీసుకుంటారని తెలిపారు.

రాజకీయ కుట్రలకు బలిచేయొద్దు

- ఉద్యోగ సంఘాల జేఏసీ సెక్రటరీ జనరల్ శ్రీనివాసరావ్
- కలెక్టరేట్ ఎదుట నిరసన



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు

వికారాబాద్: రాజకీయ పార్టీల కుట్రలకు ఉద్యోగులను బలి చేయొద్దని ఉద్యోగ సంఘాల జేఏసీ సెక్రెటరీ జనరల్ శ్రీనివాసరావ్ అన్నారు. ట్రెస్సా రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గౌతమ్‌కుమార్, ఆయా జిల్లాల అధ్యక్షులు, టీఎన్జీఓలతో కలిసి మంగళవారం ఆయన వికారాబాద్ కలెక్టరేట్‌కు వచ్చారు. లగచర్లలో జరిగిన ఘటనను తీవ్రంగా ఖండించారు. అధికారులపై దాడిని నిరసిస్తూ కలెక్టరేట్ ఎదుట బైఠాయించి ఆందోళన నిర్వహించారు. ఘటనకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా ఉద్యోగ సంఘాల నాయకులు కృష్ణయ్య, రమేశ్, విజేందర్, వాసుచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఊహించని షాక్!

గ్రామస్తుల ఆగ్రహాన్ని పసిగట్టలేని అధికారులు

- ముందస్తు ప్రణాళికతోనే దాడి
- పోలీసుల అదుపులో పాత్రధారులు
- సూత్రధారుల అరెస్టుకు రంగం సిద్ధం
- ఘటనపై పోలీసులు.. కలెక్టర్ భిన్న వాదనలు
- కొనసాగుతున్న ఉద్యోగుల నిరసనలు



ఇళ్లకు తాళం వేసి ఊరు వదలివెళ్లిన పులిచెర్లకుంట తండా వాసులు

వికారాబాద్: క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితి ఏంటి అని తెలుసుకోకుండా గ్రామంలోకి వెళ్లడమే లగచర్ల ఘటనకు కారణమనే అభిప్రాయం అధికారుల్లో వ్యక్తమవుతోంది. గ్రామంలోకి వెళ్లే ముందు అధికారులు, పోలీసుల మధ్య సమన్వయ లోపం కూడా కలెక్టర్ సహా ఉన్నతాధికారులపై దాడికి కారణమని సీనియర్ అధికారులు అంటున్నారు. ఏది ఏమైనా సీఎం ఇలాఖాలోని దుద్యాల్ మండలం లగచర్లలో సోమవారం అధికారులపై జరిగిన దాడి అనేక లోపాలను బయటపెట్టింది. ఈ ఘటన ఇటు పోలీసు శాఖతో పాటు అటు అధికారులను ఇరకాటంలో పడేసింది. దాడిపై పోలీసులు.. కలెక్టర్ భిన్న వాదనలు వినిపిస్తుండటం కూడా అయోమయానికి గురిచేస్తోంది. ఊహించని రీతిలో చోటుచేసుకున్న ఘటన ప్రభుత్వాన్ని ఇరకాటంలో పడేసింది. సీఎం సొంత నియోజకవర్గంలోనే కలెక్టర్‌పై దాడి జరగడం దేశ వ్యాప్తంగా చర్చనీయాంశం అయ్యింది. సోమవారం రాత్రి నుంచే బాధ్యులను అరెస్టు చేసే పనిలో పోలీసులు నిమగ్నం కాగా మంగళవారం కూడా ఉద్యోగ సంఘాలు విధులను బహిష్కరించి నిరసనను కొనసాగించాయి.

గ్రౌండ్ రియాలిటీ తెలుసుకోకుండా..

లగచర్ల గ్రామంలో ఫార్మాసిటీ భూ సేకరణలో భాగంగా ప్రజాభిప్రాయ సేకరణ కోసం వెళ్లిన కలెక్టర్, ఇతర అధికారులపై రైతులు, గ్రామస్తులు సోమవారం దాడి చేసిన విషయం తెలిసిందే. పోలీసులు, అధికారుల మధ్య సమన్వయ లోపమే దాడికి కారణమని ఘటనా సమయంలో ప్రత్యక్షంగా ఉన్న కొందరు అధికారులు భావిస్తున్నారు. గ్రామస్తులు పిలవగానే కలెక్టర్ ఊరిలోకి వెళ్లేందుకు సిద్ధమైనప్పుడే అక్కడ పరిస్థితి ఏంటి? ఆహ్వానిస్తున్న వారి ఆలోచన ఎలా ఉంది? అని అంచనా వేయడంలో పోలీసు అధికారులు విఫలమైనట్లు కొందరు పేర్కొంటున్నారు. గ్రామంలోని పరిస్థితిపై నిఘా వ్యవస్థలు ఇచ్చిన సమాచారం పోలీసుల వద్ద ఉన్నప్పటికీ ముందస్తు చర్యలు చేపట్టకపోవడంతోనే మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

భిన్న వాదనలు

లగచర్ల ఘటన ఎలా జరిగింది.. కారణాలేంటి అనే విషయంలో అటు పోలీసులు, ఇటు కలెక్టర్, ఉన్నతాధికారులు ఎవరికి వారు విశ్లేషించుకుంటున్నారు. దాడి జరిగిన విషయంలో ఇరు శాఖలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నాయి. సమాధానం దొరకని అనేక ప్రశ్నలు వారిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఈ ఘటనను దాడిగా పరిగణించలేమని.. ఉద్యోగులు దీన్ని ఇంతటితో మరచిపోయి విధుల్లో పాల్గొనాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచిస్తున్నారు. దాడి పక్కా ప్లాన్ ప్రకారమే జరిగిందని.. తెర వెనుక నుంచి వేరే శక్తులు రైతులను ప్రేరేపించాయని.. ఇందులో కుట్ర కోణం ఉందని.. బాధ్యులైన వారిని వదిలి పెట్టేది లేదని ఐజీ సత్యనారాయణ ప్రకటించారు. ఇలా ఎవరికి వారు భిన్న వాదనలు వినిపించడం కూడా ప్రజలతో పాటు యంత్రాంగాన్ని అయోమయానికి గురిచేస్తోంది.

రాజకీయ కుట్ర కోణంలో ఇన్వెస్టిగేషన్

లగచర్ల ఘటనకు సంబంధించి పోలీసులు వివిధ కోణాల్లో విచారణ ప్రారంభించారు. ఇప్పటికే 60 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు ప్రకటించారు. వీడియో విజువల్స్ ఆధారంగా ప్రత్యక్షంగా దాడిలో పాల్గొన్న వారిని అరెస్టు చేస్తున్నారు. ఇదే సమయంలో కాల్ లిస్టు ఆధారంగా నిందితులు ఎవరెవరితో మాట్లాడారు.. ముందస్తు ప్లాన్ ప్రకారమే దాడి జరిగిందా..? ఎవరు ప్రేరేపించారు.. ఇందులో ఏమైనా రాజకీయ కుట్ర ఉందా..? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఘటనలో ప్రత్యక్ష పాత్రధారులను అరెస్టులు చేసిన పోలీసులు సూత్రధారులను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. వారిని కూడా అరెస్టు చేసేందుకు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం. ఇందులో ఓ ప్రధాన పార్టీకి చెందిన కొందరు ముఖ్య నేతల హస్తం ఉన్నట్లు భావిస్తున్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకునేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.



రోటిబండ తండాలో ఓ ఇంటి వద్ద దిగాలుగా కూర్చున్న మహిళలు, చిన్నారులు

నిశ్శబ్ద తాండవం

- నిర్మానుష్యంగా మారిన గ్రామాలు
- ఏ ఇంటిని చూసినా తాళాలే..
- మేతకు విడిచే వారు లేక దొడ్లలోనే జీవాలు
- బిక్కుబిక్కుమంటున్న లగచెర్ల, రోటిబండ తండా, పులిచెర్లకుంట తండా ప్రజలు



మేతకు విడిచే వారు లేక ఇంటి వద్ద ఉన్న మేకలు

కొడంగల్/ దుద్యాల్: అధికారులపై దాడి నేపథ్యంలో లగచర్ల గ్రామంలో నిశ్శబ్దం అలముకుంది. నిందితుల కోసం మంగళవారం తెల్లవారుజామున 300 మంది పోలీసులు గ్రామంలో గాలింపు చర్యలు చేపట్టారు. దొరికిన వారిని దొరికినట్లు అదుపులోకి తీసుకున్నారు. మరి కొంతమంది కుటుంబ సభ్యులతో కలిసి ఇళ్లకు తాళాలు వేసి పొలాలు, బంధువుల ఇళ్లల్లో తల దాచుకుంటున్నట్లు సమాచారం.

భయం గుప్పిట్లో గ్రామాలు

ఏ సమయంలో పోలీసులు వచ్చి తీసుకెళ్తారో అని భయం ప్రజల్లో నెలకొంది. దీంతో ఇళ్లకు తాళాలు వేసి కుటుంబాలకు కుటుంబాలు ఊరు వదలి వెళ్లాయి. రైతుల ఇళ్లముందు కట్టేసిన పశువులు, మేకలకు మేత వేసేవారు లేక కేకలు పెడుతున్నాయి. గ్రామంలో కొంత మంది మహిళలు ఉన్నా పోలీసులు వచ్చి ఏమంటారోనని భయాందోళన చెందుతున్నారు. దాడికి పాల్పడిన వారిని తమకు అప్పజెప్పాలని పోలీసులను కోరుతున్నారు.

పని చేయని నెట్‌వర్క్

దుద్యాల్, బొంరాస్‌పేట్, కొడంగల్ మండలాల్లో ఆన్‌లైన్ సేవలను పోలీసులు నిలిపివేశారు. వాట్సాప్, యూట్యూబ్, ఫేస్‌బుక్ తదితర సోషల్ మీడియా సేవలను ఆపేశారు. కొడంగల్ నియోజకవర్గంలో జరుగుతున్న ప్రస్తుత పరిస్థితులు ప్రజలకు తెలియకుండా ఆన్‌లైన్ సేవలను నిలిపివేశారు. సోమవారం రాత్రి 9గంటల నుంచి మంగళవారం రాత్రి 10 గంటల వరకు నెట్‌వర్క్ పని చేయలేదు. దీంతో ఫార్మా భూ బాధిత ప్రాంతాల్లో నెలకొన్న విషయాలు ప్రజలకు తెలియడం లేదు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు యాదయ్య, మనోహర్‌రెడ్డి

దాడి హేయమైన చర్య

కాంగ్రెస్ ఎమ్మెల్యేలు యాదయ్య, మనోహర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి

అనంతగిరి: దుద్యాల్ మండలం లగిచర్ల గ్రామంలో కలెక్టర్, ఇతర అధికారులపై దాడి హేయమైన చర్య అని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మంగళవారం వికారాబాద్‌లోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇలాంటి ఘటనలు జరగడం బాధకరమన్నారు. దాడులకు పాల్పడిన వారిపై చట్టపర చర్యలు తీసుకుంటామన్నారు. న్యాయం చేయడానికి గ్రామానికి వెళ్లిన కలెక్టర్‌ను కొందరు ఊరిలోకి తీసుకెళ్లి దాడి చేయడం దారుణమన్నారు. ఈ ఘటనలో ఎంతటి వారినైనా వదిలి పెట్టేది లేదన్నారు.

దాడి వెనుక ముగ్గురి పాత్ర: మనోహర్‌రెడ్డి

అనంతరం తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. దాడి హేయమైన చర్య అన్నారు. అధికారం పోయి ఏం చేయాలో తెలియక అక్కడున్న కొంతమందిని అడ్డుపెట్టుకుని కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు వారిని ఉసిగొలిపి దాడులు చేయించారని ఆరోపించారు. ఇందుకోసం రూ.50 లక్షల నుంచి రూ. కోటి వరకు ఖర్చు చేశారని విమర్శించారు. రాజకీయ ఉనికి కోసం రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. కొందరు కిరాయి మూకలతో అధికారులపై దాడి చేయించడం దురదృష్టకరమన్నారు. కేటీఆర్ జైలుకు వెళ్లే విషయాన్ని మళ్లించడానికి ఇలాంటి వాటికి ఆజ్యం పోస్తున్నారని అన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మైపాల్‌రెడ్డి, డీసీసీబీ డైరక్టర్ కిషన్‌నాయక్, మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ, సీనియర్ నాయకులు జాఫర్, లాల్‌కృష్ణ, మల్లేశం, రాజశేఖర్‌రెడ్డి, వేణుగోపాల్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ కుట్ర ఉంది: రామ్మోహన్‌రెడ్డి



పరిగి: అధికారులపై దాడి వెనుక బీఆర్‌ఎస్ పార్టీ కుట్ర ఉందని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ప్రభుత్వం ఫార్మాసిటీ ఏర్పాటు చేస్తుంటే బీఆర్‌ఎస్ నాయకులు కావాలనే అడ్డుకుంటున్నారని విమర్శించారు. ఆ పార్టీ మండల యూత్ ప్రెసిడెంట్ సురేష్ ఉద్దేశపూర్వకంగా అధికారులను గ్రామంలోకి తీసుకెళ్లి దాడులు చేయించారన్నారు. దీనిపై ప్రభుత్వం అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తోందన్నారు. నిందితులను ప్రభుత్వం వదలదన్నారు.

సమన్వయంతో పనిచేద్దాం

- జిల్లా అభివృద్ధిలో భాగస్వాములవుదాం
- దిశ చైర్మన్, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

వికారాబాద్: ప్రభుత్వ అధికారులు సమన్వయంతో పని చేసి జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని దిశ చైర్మన్, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. దిశ వైస్ చైర్‌పర్సన్ డీకే అరుణ, కలెక్టర్ ప్రతీక్‌జైన్, అడిషనల్ కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, బీ మనోహర్‌రెడ్డితో కలిసి కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు, నిధుల మంజూరుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఏటా సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనుల కోసం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందన్నారు. పర్యాటక రంగ అభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు. ఇందులో భాగంగా అనంతగిరుల అభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. అమృత్ పథకం కింద వికారాబాద్ రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. బ్యాంకర్లు రైతు రుణాల లక్ష్యాలను అధిగమించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేస్తోందన్నారు. ఉజ్వల పథకంలో భాగంగా మున్సిపాలిటీలకు నిధులు కేటాయిస్తున్నట్లు చెప్పారు. వ్యవసాయం, ఉద్యాన, పట్టు పరిశ్రమ రంగాలను ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు. కొంత మంది రైతులు బోర్లు వేసి నీళ్లు పడకపోవడంతో అలాగే వదిలేస్తున్నారని, వాటిలో పిల్లలు పడి ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. నీళ్లు పడని బోరు బావులను వెంటనే పూడ్చి వేయాలన్నారు. ఆ దిశగా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. అనంతరం దిశ వైస్ చైర్‌పర్సన్, ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని అన్నారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం సరఫరాపై ఆరా తీశారు. పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, డీఆర్‌డీఏ, విద్యుత్, మిషన్ భగీరథ, జాతీయ రహదారులు, భూగర్భ జలవనరులు తదితర శాఖల పరిధిలో అమలవుతున్న పథకాలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్డీఓ శ్రీనివాస్, పరిగి మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

పండుగ ఉందని.. బిడ్డను తెచ్చుకుని

- పదేళ్ల కూతురుతో మహిళ ఆత్మహత్య
- బిడ్డను నడుముకు కట్టుకొని బావిలోకి దూకిన అభాగ్యురాలు
- ఆర్థిక ఇబ్బందులే కారణమంటున్న స్థానికులు



లలిత (ఫైల్)



భవాని (ఫైల్)

పరిగి: ఏడేళ్ల క్రితం భర్త మృతిచెందడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఓ మహిళ తన కూతురుతో కలిసి ఆత్మహత్యకు పాల్పడింది. తాను చనిపోతే ఒక్కగానొక్క కూతురు అనాథ అవుతుందని భావించింది. కూతురును తన నడుముకు కట్టుకొని బావిలో దూకింది. ఈ విషాద సంఘటన వికారాబాద్ జిల్లా పరిగి మండలం ఖుదావన్‌పూర్‌లో మంగళవారం వెలుగు చూసింది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన లలిత(31)కు చౌడాపూర్‌కు చెందిన ఏసయ్యతో పన్నెండేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి పదేళ్ల కూతురు భవాని ఉంది. అయితే ఏడేళ్ల క్రితమే ఏసయ్య మృతిచెందడంతో కూలీ పనులు చేసుకుంటూ లలిత కాలం వెళ్లదీస్తోంది. భవానిని పరిగి ఎస్సీ బాలికల వసతి గృహంలో ఉంచి, నంబర్ వన్ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదివిస్తోంది. ఇదిలా ఉండగా సోమవారం సాయంత్రం హాస్టల్ వద్దకు వెళ్లిన లలిత తమ ఇంట్లో పండుగ ఉందని, భవానిని తీసుకుని ఖుదావన్‌పూర్ బయలుదేరింది. భర్త చనిపోయిన మానసిక క్షోభ, ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఆత్మహత్యే శరణ్యమని భావించింది. చీకటి పడుతుండగా తన చీర కొంగుతో భవానిని నడుముకు కట్టుకుని గ్రామ సమీపంలోని బావిలో దూకింది. ఇరువురి ఆధార్ కార్డులను తల్లీకూతురు మరణంతో గ్రామంలో విషాదం అలుముకుంది. ఇరువురి ఆధార్ కార్డులు బావి గట్టుపై లభించాయి. ఈ విషయంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.



ప్రధాన శిలువ వద్ద కొవ్వొత్తులు వెలిగిస్తున్న బిషప్ డేనియల్



మెథడిస్టు క్రిస్టియన్ జాతరను ప్రారంభిస్తున్న బిషప్ డేనియల్, ఆయన సతీమణి

భక్తిభావం విలసిల్లాలి

బిషప్ డేనియల్ దంపతులు, మెథడిస్టు జాతర ప్రారంభం

మొదటి రోజు ప్రత్యేక ప్రార్థనలు • వెలసిన దుకాణాలు

ధారూరు: ధారూరు మెథడిస్టు క్రిస్టియన్ జాతరను మంగళవారం బిషప్ ఎంఏ డేనియల్, ఆశా డేనియల్ దంపతులు ప్రారంభించారు. ప్రధాన ద్వారం పక్కన కొత్తగా ఏర్పాటు చేసిన ఏసుక్రీస్తు శిలువ వద్దకు చేరుకొని కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేశారు. అనంతరం ఏసుప్రభువును స్తుతిస్తూ పాటలు పాడారు. ఆ తర్వాత ప్రధాన శిలువ వద్దకు ఊరేగింపుగా వెళ్లి ప్రార్థనలు చేశారు. బిషప్ దంపతులకు జాతర కార్యదర్శులు దయానంద్, స్టీవెన్, జాతీయ లే లీడర్ ఇమానియల్ స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సమావేశంలో బిషప్ ఎంఏ డేనియల్ మాట్లాడారు. ప్రతి సంవత్సరం నవంబరులో జరిగే ఏసుక్రీస్తు జాతరకు మీరంతా సహకరించడం అభినందనీయమన్నారు. ఈ జాతరను 1922 నుంచి ఏటా నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం 102 వసంతాలకు చేరిందని వివరించారు. జాతరకు వచ్చే యాత్రికులకు ఏసుక్రీస్తు ప్రబోధనలను వినిపించి వారిలో భక్తి కలిగేలా చేయాలని అన్నారు. క్రీస్తును మనసా, వాచా నమ్మి ప్రార్థిస్తే కోరిన కోర్కెలు తీరుతాయని తెలిపారు. కార్యక్రమంలో రెవరెన్ మార్క్ డీఎస్, హెచ్‌ఆర్‌సీ గ్యాబ్రియల్, ఉమ్మడి రాష్ట్రంలోని వివిధ జిల్లాల అధికారులు, కాన్ఫరెన్ లే లీడర్లు, కాన్ఫరెన్స్ కోశాధికారులు, పాస్టర్లు, యాత్రికులు పాల్గొన్నారు.

తరలివచ్చిన పాస్టర్లు

మొదటిరోజు జాతరకు దక్షిణ భారతదేశంలోని అన్ని ప్రాంతాల నుంచి పాస్టర్లు వచ్చారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జాతరలో దుకాణాలను ఏర్పాటు చేసుకునేందుకు వ్యాపారులు పెద్ద సంఖ్యలో వచ్చారు. ఆర్కెస్ట్రా బృందం సభ్యులు ఏసుక్రీస్తు పాటలు పాడారు.



ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న కాన్ఫరెన్ లే లీడర్లు, కోశాధికారులు, పాస్టర్లు, యాత్రికులు

క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి



లబ్ధిదారుడికి చెక్కు అందజేస్తున్న మహేందర్‌రెడ్డి

తాండూరు రూరల్: సీఎం సహాయ నిధి పేదలకు వరమని మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన జగ్గప్ప కుమారుడు అభిరామ్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈమేరకు సీఎంఆర్ఎఫ్ రూ.44 వేల చెక్కును హైదరాబాద్‌లో ఆయన నివాసంలో అందజేశారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న ప్రతి నిరుపేద కుటుంబానికి సీఎం సహాయ నిధితో ఆపన్నహస్తం అందిస్తుందన్నారు.

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు



అలంకరణలో అమ్మవారు

తాండూరు రూరల్: మండల పరిధిలోని కోత్లాపూర్ గ్రామ శివారులో ఉన్న రేణుక ఎల్లమ్మ అమ్మవారికి మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కర్ణాటకలోని కల్లూరు, మిర్యాణ్, చింబోళితో పాటు మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు ఆలయానికి చేరుకొని పూజలు నిర్వహించారు. భక్తుల కొంగు బంగారంగా రేణుక ఎల్లమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్నారు.

పంచాయతీ ఎన్నికలకు సన్నద్ధం

కార్యకర్తల సమావేశంలో బీఎస్పీ రాష్ట్ర కో ఆర్డినేటర్ ఇబ్రాం శేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న ఇబ్రాం శేఖర్

తాండూరు టౌన్: రానున్న పంచాయతీ ఎన్నికల్లో బహుజనులు సత్తా చాటాలని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కో ఆర్డినేటర్, బడంగ్‌పేట్ డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ పేర్కొన్నారు. మంగళవారం తాండూరులో నిర్వహించిన జిల్లా స్థాయి కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బహుజనులు రాజ్యాధికారం కైవసం చేసుకోవాలనే ఉద్దేశంతోనే ప్రజల వైపు నిలబడి బీఎస్పీ పోరాటం చేస్తోందన్నారు. రానున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో బీఎస్పీ అధిక స్థానాలు గెలిచేందుకు నిరంతర కృషి చేయాలన్నారు. బహుజనులను ఏకం చేసి, బడుగు బలహీన వర్గాల నాయకులను గెలిపించాలన్నారు. అనంతరం బీఎస్పీ నూతన కమిటీని ఆయన ప్రకటించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోయిని చంద్రశేఖర్ ముదిరాజ్, జిల్లా ఇన్‌చార్జి సయ్యద్ అమీర్, జిల్లా అధ్యక్షుడు ఉదయ్, ఉపాధ్యక్షుడు బాల్‌రాజ్, కార్యదర్శులు సువర్ణ, నవీన్, తాండూరు అధ్యక్షుడు నరేందర్, నాయకులు ప్రవీణ్, అమ్జద్ అలీ, రమేశ్, శ్రీనివాస్, కృష్ణయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'సర్వేలో ఎస్సీ మాదిగగా నమోదు చేయండి'

షాద్‌నగర్ రూరల్: ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వేలో ఎస్సీ మాదిగగా నమోదు చేసుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహ ఆ కులస్తులకు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. కుల సర్వేను చేపట్టేందుకు గ్రామాలకు వస్తున్న ఎన్యుమరేటర్లు సర్వే వివరాలు నమోదు చేస్తున్న ఫాంలో ఎస్సీ మాదిగ అని రాయించుకోవాలని పేర్కొన్నారు.

ధాన్యం.. కొనుగోలులో జాప్యం!

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి వారం రోజులు దాటినా నేటికీ బార్‌దాన్ (సంచులు) లేవు. ఇప్పటివరకు కిలో ధాన్యం తూకం జరగలేదు. కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలు ఎవరో, ఎక్కడ ఉంటారో తెలియని పరిస్థితి నెలకొంది.

- చెంగోల్‌లో వారం కిత్రం కొనుగోలు కేంద్రం ప్రారంభం
- ఇప్పటివరకు కిలో వడ్లు కొనని వైనం
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు



పెద్దేముల్: మంబాపూర్ కొనుగోలు కేంద్రం వద్ద ఆరబెట్టిన ధాన్యం

తాండూరు రూరల్: ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకునేందుకు అన్నదాతలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పది రోజుల క్రితం వడ్లను రాశిగా పోసి విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించలేదు. తాండూరు మండలం చెంగోల్ గ్రామంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో వారం రోజుల క్రితం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అధికారులు ప్రారంభించారు. అప్పుడు నాయకులు, అధికారులు వచ్చి కొబ్బరికాయ కొట్టి వెళ్లిపోయారు. కానీ ఇప్పటి వరకు కిలో వడ్లు కూడా కొనలేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే చాలా మంది కర్షకులు వడ్లను రాశిగా పోసి ఆరబెడుతున్నారు. వర్షం వస్తే చేతికి వచ్చిన పంట అమ్ముకునేందుకు కూడా రాదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తిష్టవేసిన దళారులు

ధాన్యం కొనుగోలు కేంద్రం ఆలస్యం కావడంతో ఇదే అదునుగా భావించిన కొందరు దళారులు క్వింటాల్‌కు రూ.2,150 నుంచి రూ.2,100 వరకు కొనుగోలు చేస్తున్నారు. కేంద్రం వద్దకే లారీలను తీసుకొచ్చి వెంటనే కంటా చేసి తీసుకెళ్తున్నారు. రైతులు కూడా ఏమీ చేయలేక తప్పని పరిస్థితుల్లో ప్రైవేట్‌కు అమ్ముకుంటున్నారు.

పది రోజులైతుంది



నాకున్న పొలంలో వరి పంట సాగు చేశాను. వడ్లను కొనుగోలు కేంద్రం వద్దకు తెచ్చి ఆరబెట్టాను. ఇప్పటి వరకు అధికారులు నా వడ్లను కొనలేదు. 70 క్వింటాళ్ల వరకు ధాన్యం ఉండటంతో ప్రైవేట్‌కు అమ్మితే నష్టపోతాం. ప్రభుత్వం వెంటనే వడ్లను కొనుగోలు చేయాలి.

– వడ్డె వెంకటయ్య, రైతు, చెంగోల్

పట్టించుకునేవారు లేరు



చెంగోల్‌లోని బైపాస్ రోడ్డు వద్ద కొనుగోలు కేంద్రం వద్దకు ధాన్యాన్ని తీసుకొచ్చా. ప్రస్తుతం మూడు రోజులు అవుతుంది. వడ్లను ఆరబెట్టుతున్నాం. కనీసం బార్దన్‌లు కూడా అందుబాటులో లేవు. కొనుగోలు కేంద్రం ప్రారంభించినా ఇప్పటి వరకు మా వడ్లు కొనలేదు.

– నర్సింలు, రైతు, చెంగోల్

కిలో తూకం వేస్తే ఒట్టు!



ధాన్యం ఆరబెడుతున్న రైతు

పెద్దేముల్: రైతులు ఇబ్బందులు కలుగకుండా సకాలంలో పంటలను విక్రయించుకోవాలని వారం క్రితం స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి మంబాపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. సకాలంలో తూకాలు చేయాలని, బార్‌దాన్ సమస్య లేకుండా చుడాలని, సమస్యలు ఏదైన ఉంటే తమ దృష్టికి తేవాలని ఎమ్మెల్యే తాండూరు డీసీఎంఎస్ మేనేజర్ ఎల్లయ్య, మంబాపూర్ సెంటన్ ఇన్‌చార్జి సుదర్శన్‌రెడ్డిలకు ఆదేశాలు జారీ చేశారు. అయినా ఇంత వరకు కొనుగోలు కేంద్రాల వద్ద తూకాలు ప్రారంభం చేయలేదు. దీంతో ప్రతి నిత్యం పలు గ్రామాల రైతులు ఎదురు చుస్తున్నారు.

వారం రోజులుగా ఇబ్బంది



పంట కోసి పది రోజులు దాటింది. ధాన్యం ఆరబెట్టి వారం రోజులు అవుతుంది. రాత్రి, పగలు మబ్బులు రావడంతో భయం అవుతుంది. ఏ సమయంలో చిన్నపాటి చినుకు పడినా చేసిన కష్టం వృథా అవుతుంది. వెంటనే కొనుగోలు కేంద్రంను ప్రారంభం చేయాలి.

– రాములు, రైతు, మంబాపూర్

సంచుల సమస్య తీవ్రం



నాలుగు రోజుల నుంచి సంచుల కోసం ఎదురు చుస్తున్నాం. చిన్న పాటి చినుకు పడినా ధాన్యం తడిసి పోతుంది. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, బార్‌దాన్ సమస్యను తీర్చాలి. త్వరలో తూకాలు చేస్తామంటే కోతలు త్వరలో పూర్తి చేశాం. ప్రతి ఏటా ఇదే సమస్య అవుతుంది.

– నారాయణ, రైతు, మంబాపూర్

ఏటా ఇదే తీరు..



ఏటా సమయానికి తూకాలు కావు. ఎమ్మెల్యే రైతులకు ఎలాంటి సమస్యలు రాకుండా చుడాలని పదే, పదే చెప్పినా అధికారులకు పట్టడం లేదు. బార్‌దాన్ లేకుంటే తూకాలు ఎలా చేయాలి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి.

– శ్రావణ్‌కుమార్, రైతు, మంబాపూర్

మందకొడిగా పత్తి కొనుగోలు



అయ్యప్ప కాటన్ మిల్లులో నిలిచిన పత్తి లారీలు

మోమిన్‌పేట: మండల పరిధిలోని మోమిన్‌పేటలో ఉన్న అయ్యప్ప కాటన్ మిల్లులో పత్తి కొనుగోలు మందకొడిగా జరుగుతుంది. ఈనెల 6న ప్రారంభమైన పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఇప్పుడిప్పుడే పత్తి తీత పనులు ముమ్మరంగా జరుగుతుండటంతో కొనుగోలు కేంద్రానికి తక్కువగా వస్తుంది. ఇప్పటి వరకు 1200 క్వింటాళ్ల పత్తిని సేకరించారు. 8శాతం కంటే తక్కువగా ఉంటేనే క్వింటాల్‌కు రూ.7,521లు మద్దతు ధర లభిస్తుందన్నారు. సీసీఐ, మిల్లుల యాజమానులతో జరిగిన చర్చలు సఫలం కావడంతో కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి.

15 నుంచి రంగంపల్లిలో ఉత్సవాలు

పరిగి: మండల పరిధిలోని రంగంపల్లి గ్రామంలో వెలసిన అనంతపద్మనాభ స్వామి జాతర మహోత్సవాలను ఈనెల 15 నుంచి నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15న మహాగణపతి పూజ, స్వామివారికి అభిషేకం, పల్లకీ సేవ నిర్వహిస్తామన్నారు. 16న స్వామి వారి ఊరేగింపు, సత్యనారాయణ స్వామి వ్రతం, భజన, ఒగ్గుకథలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు స్వామివారి ప్రత్యేక పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

దుమ్ముతో పంటలు నాశనం

ఆందోళన వ్యక్తం చేసిన మల్కాపూర్ రైతులు



ఐసీఎల్ ఫ్యాక్టరీ ప్రతినిధులకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

తాండూరు రూరల్: మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామ శివారులో ఉన్న సిమెంట్ ఫ్యాక్టరీ(ఐసీఎల్) ద్వారా వచ్చే దుమ్ముతో పంటలు నాశనమైతున్నాయని రైతులు ఆందోళన చేపట్టారు. మంగళవారం సిమెంట్ ఫ్యాక్టరీ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. గ్రామ శివారులోని ఫ్యాక్టరీ సమీపంలో కంది పంటను సాగు చేశామన్నారు. పరిశ్రమ నుంచి వెలువడే దుమ్ముతో పంట నాశనమవుతుందన్నారు. గతంలో కంటే ప్రస్తుతం దుమ్ము ఎక్కువగా వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఫ్యాక్టరీ ఎదుట పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు. అనంతరం కంపెనీ డిప్యూటీ మేనేజర్ జ్ఞానేశ్వర్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, రైతులు నర్సిములు, శ్రీనివాస్‌రెడ్డి, జగ్గప్ప, హన్మప్ప, అనంతప్ప, మహమ్మద్, చిరంజీవి తదితరులు ఉన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



కొడంగల్ జట్టుకు బహుమతి అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్ తదితరులు

మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్

పరిగి: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ కుమార్ అన్నారు. పట్టణ కేంద్రంలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ 68వ జిల్లా స్థాయి అండర్-17 క్రికెట్ పోటీలు నిర్వహించారు.జిల్లాలోని తాండూరు, పరిగి, వికారాబాద్, కొడంగల్, పెద్దేముల్, మోమిన్‌పేట్‌ల టీంలు పాల్గొన్నాయి. ఫైనల్‌లో కొడంగల్, తాండూర్ తలపడగా గెలుపొందిన కొడంగల్ జట్టుకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సెలక్షన్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంగానే కాదు ఎమ్మెల్యేగానూ ఫెయిల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

- ఫార్మాసిటీపై రేవంత్‌రెడ్డి స్పష్టతనివ్వాలి
- రైతులను ఇబ్బంది పెట్టి రాక్షసానందం
- భూ బాధితుల సమావేశంలో ఎమ్మెల్యే సబితారెడ్డి

కందుకూరు: ప్రభుత్వం తప్పుడు నిర్ణయాలతో రైతులతో పాటు అధికారులు బాధపడుతున్నారని, రేవంత్‌రెడ్డి సీఎంగానే కాదు ఎమ్మెల్యేగా కూడా ఫెయిల్ అయ్యారని స్థానిక ఎమ్మెల్యే సబితారెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ 8 నెలల పాలనలో రైతులను ఇబ్బంది పెట్టి రాక్షసానందం పొందుతున్నారన్నారు. మండల పరిధి లోని అగర్‌మియాగూడలో మాజీ సర్పంచులు ఈ.భూపాల్‌రెడ్డి, ఎస్.నారాయణ, రైతులు ఎస్.శ్రీకాంత్, డి.సుధాకర్‌రెడ్డి, లిక్కి జంగారెడ్డి తదితరుల ఆధ్వర్యంలో మంగళవారం ఫోర్త్‌సిటీ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులతో సమావేశం నిర్వహించారు. రైతులకు మద్దతుగా హాజరైన సబితారెడ్డి మాట్లాడుతూ.. ఫోర్త్‌సిటీ పేరుతో రియల్ వ్యాపారం చేసుకోవడానికే 300 అడుగుల రహదారి చేపడుతున్నారని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో రైతులు నష్టపోవద్దనే ఉద్దేశంతో అప్పట్లో ప్రతిపాదించిన వంద అడుగుల రోడ్డును నిర్మించలేదన్నారు. శ్రీశైలం రహదారి నుంచి నేరుగా ఫార్మాసిటీలోకి రోడ్డును వేశామన్నారు. శ్రీశైలం రహదారిని 8 వరుసలుగా విస్తరించనున్నారని, ఆ రోడ్డుతో పాటు గతంలో నిర్మించిన 200 అడుగుల రహదారి ఉంద న్నారు. అన్ని వైపులా అక్కడికి చేరుకునేలా రహదారులు ఉండగా కొత్తగా 300 అడుగుల రహదారి ఎందుకని ప్రశ్నించారు. ఆ రహదారి నిర్మాణంతో 2 వేల రైతు కుటుంబాలు రోడ్డున పడనున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తాము తుక్కుగూడ నుంచి నేషనల్ హైవే మీదుగా మెట్రో నిర్మించాలని గతంలో తలపెడితే ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి దాన్ని మార్చి రైతులకు ఇబ్బందులు కలుగజేస్తున్నాడని దుయ్యబట్టారు. ఓ వైపు ఫార్మాసిటీ రద్దు చేశామని బయట చెబుతున్నారని, మరోవైపు కోర్టులో మాత్రం రద్దు చేయలేదని చెబుతున్నారన్నారు. ఫార్మాసిటీ రద్దు చేశారా లేక కొనసాగిస్తున్నారా? అనే విషయాన్ని ముందు ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. కొడంగల్ నియోజకవర్గంలో అధికారులపై కోపంతో రైతులు చేసిన దాడి కాదని, అది సీఎంపై జరిగిన దాడిగా భావిస్తున్నామన్నారు. 300 అడుగుల రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు భూమికి భూమి ఇవ్వాలని సబితారెడ్డి డిమాండ్ చేశారు. భూసేకరణ అడ్డుకునేలా అవసరమైతే రైతుల తరఫున న్యాయస్థానానికి వెళ్తామన్నారు. అనంతరం భూసేకర ణకు వేసిన మార్కింగ్‌ను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, వైస్ చైర్మన్ జి.విజేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్, మాజీ సర్పంచులు గోపాల్‌రెడ్డి, గణేశ్, దేవేందర్, సీనియర్ నాయకులు లక్ష్మీనర్సింహారెడ్డి, దరశ రథ, రేవంత్‌రెడ్డి, మేఘనాథ్‌రెడ్డి, ఆనంద్, వెంకటేశ్‌గౌడ్, సదానంద్‌గౌడ్, సామ య్య, దర్శన్‌రెడ్డి, కొండల్ రెడ్డి, రామకృష్ణ, రైతులు బీరప్ప, జగన్‌మోహన్‌రావు, జంగయ్య, ఐలయ్య పాల్గొన్నారు.

టీచర్ నియామకాలు చేపట్టండి

గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌నాయక్



మాట్లాడుతున్న గిరిజన విద్యార్థి సంఘం నాయకులు

కుల్కచర్ల: కేజీబీవీల్లో ఉపాధ్యాయుల నియామకం పూర్తిస్థాయిలో చేపట్టకపోవడంతో నిరుపేద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉందని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్ పేర్కొన్నారు. మంగళవారం కుల్కచర్లలో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత నెలకొందన్నారు. అధికారులు మొద్దు నిద్రను వీడి విద్యార్థులు నష్టపోకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు అంబర్‌సింగ్‌నాయక్, మండల అధ్యక్షుడు అనిల్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

నేడు చేవెళ్లకు మంత్రి కోమటిరెడ్డి

చేవెళ్ల: రాష్ట్ర రోడ్డు రవాణాశాఖ మంత్రి కోమ టిరెడ్డి వెంకట్‌రెడ్డి బుధవారం మండలంలో పర్యటించనున్నారు. ఈ మేరకు కాంగ్రెస్ చేవెళ్ల మండల అధ్యక్షుడు అల్లంపల్లి వీరేందర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని ముడిమ్యాల, వయా రావుపల్లి, మేడిపల్లిల మీదుగా ప్రొద్దటూరు గేట్ వరకు నిర్మిస్తున్న బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో పాటు మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్సీ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య, మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి, జిల్లా అధికారులు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొంటారని వివరించారు.

కొనుగోలు కేంద్రాలతో రైతులకు మేలు



బండవెల్కిచర్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నేతలు

కుల్కచర్ల: రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి సూచించారు. మంగళవారం అంతారం, సాల్వీడు, బండవెల్కిచర్ల గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు పండించిన వరి ధాన్యానికి మద్దతు ధరను అందిస్తూ, ప్రతీ గింజను కొనేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చిందన్నారు. ఈ అవకాశాన్ని అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దళారులను ఆశ్రయిస్తే తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గోవర్ధన్ రెడ్డి, పీఏసీఎస్ సీఈఓ బక్కారెడ్డి, సొసైటీ డైరెక్టర్ కొండయ్య, మాజీ ఎంపీపీ అంజిలయ్య, నాయకులు బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోతల జోరు.. ఖర్చుతో బేజారు



ఆలేడ్ శివారులో యంత్రంతో వరి కోత



రైతులు ఆరబోసిన ధాన్యం

వరి కోతల సమయంలో కూలీల సమస్య అన్నదాతలను కలవరపెడుతోంది. విపరీతమైన కూలీలు తలకు మించిన భారంగా మారాయని పేర్కొంటున్నారు. దీంతో యంత్రాలతో వరి కోతలకు రైతులు ఆసక్తి చూపుతున్నారు.

- వరి నూర్పిళ్లతో రైతుల హడావుడి
- కూలీలు పెరిగాయంటూ ఆవేదన
- కోత యంత్రాలకు భలే డిమాండ్

దుద్యాల్: వర్షాకాలంలో పండించిన వరి ప్రస్తుతం కోతలు, నూర్పిడిలు సాగుతున్నాయి. రైతులు, కూలీలు పొలాల్లో బిజీగా ఉంటున్నారు. వ్యవసాయ కూలీలకు చేతినిండా పని లభిస్తోంది. కోత సమయం కావడంతో నూర్పిడి యంత్రాలకు భలే గిరాకీ వచ్చింది. మండలంలో దాదాపుగా 10 వేల ఎకరాలకు పైగా వరి పంటను రైతులు సాగు చేశారు. నవంబర్ నెల చివరి వరకు దాదాపు వరి కోతలు సాగనున్నాయి. వరి పొలాలు బురదమయంగా ఉండడంతో యంత్రాల ద్వారా కోతకు పనికి రాని పొలాల్లో కూలీల ద్వారా కోతలు చేపట్టాల్సి వస్తుంది. దీంతో కూలీలకు సైతం భారీగా డిమాండ్ ఉండడంతో ఒక్కో కూలికి రూ.500 వరకు ఇస్తున్నారు. ఒక్క ఎకరం వరి పంటను కోయడానికి సుమారు 15 మంది కూలీలు అవసరం ఉంటుందని రైతులు పేర్కొన్నారు. వారికి కూలీ డబ్బులు చెల్లించడం భారంగా మారిందని వాపోతున్నారు. దీంతో ఇబ్బందులు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యంత్రాల సహాయంతో వరి కోతలు జరిపితే ఒక్క ఎకరం దాదాపు ఒక గంట సమయం మాత్రమే పడుతుంది. దానికి గాను ఖర్చు రూ.3 వేలు మాత్రమే అవుతుంది. కూలీలతో కోపిస్తే మాత్రం రూ.10 వేల పైమాటే అంటున్నారు. అందుకోసమే రైతులు యంత్రాలనే నమ్ముకొని కోతలు నిర్వహిస్తున్నారు.

అమ్మకాలకు వెనుకడుగు

వరి కోతల అనంతరం వడ్లు అమ్మడానికి అన్నదాతలు వెనకడుగేస్తున్నారు. ప్రభుత్వం కొనుగోలులో ఎన్నో నియమ నిబంధనలు పెట్టడమే ఇందుకు కారణమని రైతన్నలు వాపోతున్నారు. దొడ్డు రకానికి, సన్న రకానికి ఒకే ధరలు ప్రకటించడం ఎంటనీ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సన్న రకాల వడ్లకు బోనస్ కాకుండా అయితే దొడ్డు రకం ధాన్యం ధర కంటే రూ.20 తక్కువగా ఉండడం విడ్డూరంగా ఉందని అన్నదాతలు ముక్కున వేలేసుకుంటున్నారు. దొడ్డు రకం వరి క్వింటాల్ ధర రూ.2,320 కాగా సన్న రకానికి రూ.2,300లే ప్రకటించారు. దానికి తోడు బోనస్ కలుపగా రూ.2,800కి కొనుగోలు చేయడానికి ప్రభుత్వం ముందుకొచ్చింది. స్థానికంగా దీనికి రైతులు అసంతృప్తితో ఉన్నారు.

సన్నాలకు ధర తక్కువ

సన్న రకాల వరి ధాన్యానికి సాధారణంగానే క్వింటాలుకు రూ.మూడు వేలపై వరకు ఉంటుంది. కానీ ప్రభుత్వం మాత్రం బోనస్‌తో కలిపి కేవలం రూ.2,800 ప్రకటించింది. దీంతో సన్నరకం వరి సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం రైతులను మద్దతు ధరలు పెంచి ఆదుకుంటుందనుకుంటే తగ్గించి నట్టేట్లో ముంచుతుందని కర్షకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం సన్నరకం వడ్లకు ధరలు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు.